క్లుప్తంగా

వైభవం.. కుంభాభిషేకం



చంద్రగిరి : తొండవాడలో నూతనంగా నిర్మించిన తొల్లమ్మ ఆలయ కుంభాభిషేకాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. సర్పంచ్ మల్లం దీపిక రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ మల్లం చంద్రమౌళి రెడ్డి, గ్రామ పెద్దలు ప్రొద్దుటూరి చంద్రమౌళిరెడ్డి, దినకర్ రెడ్డి, మునిశంకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉమాపతి రెడ్డి పాల్గొన్నారు.

06సీడీఆర్42 విశేషాలంకరణలో అమ్మవారు

విద్యార్థికి అభినందన



కార్తికేయను సత్కరిస్తున్న సుధాకర్‌నాయుడు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి రైల్వేకాలనీలోని మాతృశ్రీ హైస్కూల్ పూర్వ విద్యార్థి కె.కార్తికేయ ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఓబీసీ కేటగిరి కింద 4696వ ర్యాంకు సాధించాడు. శుక్రవారం ఈ మేరకు పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో పూర్వ విద్యార్థి కార్తికేయను స్కూల్ కరస్పాండెంట్ కె.సుధాకర్‌నాయుడు సత్కరించారు. తమ విద్యార్థి ఐఐటీలో సీటు సాధించడం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కేవీ రమ, కె.రంజిత పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో సీవీఎస్‌ఓ

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతీదేవిని టీటీడీ సీవీఎస్‌ఓ మురళీకృష్ణ శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సీవీఎస్‌ఓ మాట్లాడుతూ తిరుమల శ్రీవారి భక్తుల భద్రతకు భరోసా కల్పిస్తామని తెలిపారు.

నిలిచిన 'సేవ'లు

చంద్రగిరి : ఏపీ–సేవ పోర్టల్ కింద అందిస్తున్న సేవలను శనివారం నుంచి తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పోర్టల్‌ను మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ నుంచి రాష్ట్ర డేటా సెంటర్‌కు మైగ్రేషన్ చేపట్టనున్నారన్నారు. ఈ క్రమంలో శనివారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు సేవలను నిలుపుదల చేశారని వెల్లడించారు. ఈ కారణంగా ఆదాయ, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్లు, మ్యుటేషన్, రేషన్ కార్డు, ఇంటి పట్టాలు, సీనియర్ సిటిజన్ పత్రాలు, వివాహ ధ్రువీకరణ పత్రాలు, రెవెన్యూ నీటి పన్ను, ఎంఏయూడీ, మత్స్యశాఖ సేవలకు అంతరాయం ఏర్పడనుందని వివరించారు. మిగిలిన సేవలను మీసేవ ద్వారా పొందవచ్చని తెలిపారు.

మామిడి రైతు కుదేలు

తిరుపతి కల్చరల్ : ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం కావడంతో మామిడి రైతు కుదేలైనట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గురువారం పుత్తూరు ప్రాంతంలో సీపీఎం, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మామిడి రైతుల సమస్యలు తెలుసుకున్నట్లు వెల్లడించారు. పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని, గుజ్జు ఫ్యాక్టరీ యాజమాన్యాలు కేజీ రూ.5లకు కూడా తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నట్లు తెలిపారు. ఎకరాకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి పెడితే, ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం, ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందించడం లేదని రైతులు వెల్లడించినట్లు ఆరోపించారు. వారం క్రితం చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు గుజ్జు ఫ్యాక్టరీ యాజమాన్యాలతో, రైతు సంఘాలతో మామిడి పంటకు గిట్టుబాటు ధర విషయంపై చర్చించి టన్నుకు రూ.12 వేలు చొప్పున ధర నిర్ణయించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని, ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మామిడి రైతులకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. మామిడి బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు పల్ప్‌పై జీఎస్టీ రద్దు చేయాలని సూచించారు. సమావేశంలో సీపీఎం నేతలు సుబ్రమణ్యం, వేణుగోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత పాల్గొన్నారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం



మొక్కలు అందిస్తున్న ఆస్పత్రి ప్రతినిధులు

తిరుపతి తుడా : ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లో శుక్రవారం ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం సహకారంతో ఆస్టర్ వలంటీర్లు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథులుగా సంయుక్త ముఖ్య పర్యావరణ ఇంజినీర్ ఎస్ఎస్ఎస్ మురళి, ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని హాజరై ప్లాస్టిక్ వినియోగం తగ్గించాల్సిన అవసరం, మొక్కలు నాటడంతో కలిగే లాభాలు, పరిసరాల పరిశుభ్రతపై సందేశాలను అందించారు. అనంతరం ఆస్పత్రి ఆధ్వర్యంలో100 మొక్కలను ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో నాటారు. అలాగే పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

గరుడ విహారి!











శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం గరుడ వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.34.46లక్షల విలువైన తిరుమల శ్రీవారి ఆభరణాలను అలంకరించారు. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు స్వామివారు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గరుడుని అధిరోహించి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కళాకారుల కోలాటాలు, నృత్యాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఈ క్రమంలో ఉదయం స్వామి వారు మోహినీ అవతారంలో పల్లకిపై కొలువుదీరి భక్తులను కరుణించారు. పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, జేఈఓ వీరబ్రహ్మం, ఎఫ్ ఏ అండ్ సీఏవో ఓ.బాలాజీ, డిప్యూటీ ఈవోలు ఎం.లోకనాథం, ఎస్ఈ. జగన్‌మోహన్‌రెడ్డి, వీఆర్ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు. - తిరుపతి కల్చరల్

నీకా..నాకా..సై

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరుపతి అభివృద్ధి తిరోగమనం బాట పట్టింది. ఒకటి రెండు చోట్ల రోడ్లపై గుంతలు పూడ్చడం మినహా చేసిందేమీ కనిపించడం లేదు. ఈ క్రమలో ఆర్థిక సంఘం నిధులు రావడంతో కూటమి పార్టీల నేతల నడుమ చిచ్చు రేగింది. పనులు దక్కించుకునేందుకు హోరాహోరీ సమరం మొదలైంది. ఒకవైపు ఎమ్మెల్యే బంధువు చక్రం తిప్పేందుకు యత్నిస్తుండగా, మరోవైపు టీడీపీ నేత పగ్గాలు చేజిక్కించుకునేందుకు రంగంలోకి దిగడంతో పరిస్థితి ముదిరి పాకాన పడింది. అలాగే లోకల్ కాంట్రాక్టర్లు సైతం కమీషన్ ఇచ్చేందుకు అంగీకరించినా.. వేరేవాళ్లకి పనులు కట్టబెడితే మాత్రం సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. దీంతో ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన టెండర్ ప్రక్రియ.. మూడో పర్యాయమైనా పూర్తవుతుందో లేదో అని కార్పొరేషన్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఎమ్మెల్యే వర్సెస్ కాంట్రాక్టర్లు

- ముదిరిన కార్పొరేషన్ కాంట్రాక్ట్‌ల వ్యవహారం
- అన్నీ తనకే కావాలని ఎమ్మెల్యే బంధువు ఒత్తిడి
- కమీషన్ మాత్రమే ఇస్తామంటున్న లోకల్ కాంట్రాక్టర్లు
- చిత్తూరు నుంచి దిగుతున్న ప్రజాప్రతినిధి వర్గీయులు
- లాబీయింగ్‌లో రెండుసార్లు టెండర్లు రద్దు చేసిన అధికారులు
- ఈ నెల 9న మూడో పర్యాయం టెండర్ ఓపెన్



నగరపాలక సంస్థ కార్యాలయం

తిరుపతి తుడా : కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో తిరుపతి అభివృద్ధి పూర్తిగా పడకేసింది. నాలుగు రోడ్లు మినహా నగరంలో ఎక్కడ అభివృద్ధి ఆనవాళ్లు కనిపించడంలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులకు అనుమతులు రావడంతో అభివృద్ధి పనులు చేయక తప్పని పరిస్థితి. దీంతో ఆ నిధులకు సంబంధించి టెండర్లు పిలిచారు. ఈ టెండర్ల వ్యవహారం కూటమి నేతల్లో చిచ్చు రేపింది. ఈ పనులన్నీ తనకే కావాలని ఎమ్మెల్యే అండతో ఆయన సమీప బంధువు చక్రం తిప్పుతుండగా మీకు ఇవ్వాల్సిన కమీషన్ ఇస్తామే తప్ప పనులను ఎట్టి పరిస్థితుల్లో అప్పగించే ప్రసక్తే లేదంటూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్లు తెగేసి చెబుతున్నారు. దీంతో వ్యవహారం రచ్చకెక్కింది. ఎమ్మెల్యే వర్సెస్ కాంట్రాక్టర్లుగా మారింది. ముచ్చటగా మూడోసారి ఈ నెల 9వ తేదీన టెండర్లను ఓపెన్ చేయనున్నారు. ఆరోజు ఏం జరిగినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఇరు వర్గాలవారు భీష్మించుకు కూర్చున్నారు. దీంతో టెండర్ల వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది.

పనుల జోలికి రావద్దు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ప్రజా ప్రతినిధితో మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ చర్చలు జరిపి ఓ ఒప్పందానికి వచ్చింది. ఓ టీడీపీ నేత ఈఅసోసియేషన్‌కు గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. పనులను ఎవరెవరికి కేటాయించాలనే వ్యవహారాన్ని నడుపుతూ తాను ఓ రెండు పర్సెంట్ నొక్కేస్తున్నాడు. ఈ ఒప్పందంలో ఎమ్మెల్యేకి ఆయా పనుల మేరకు ఏడు నుంచి తొమ్మిది శాతం టెండర్ దక్కించుకున్న వెంటనే చెల్లించుకునేలా నిర్ణయానికి వచ్చారు. ఇటీవల కొన్ని అభివృద్ధి పనులకు సంబంధించి అనుకున్న ప్రకారం ఎమ్మెల్యేకి పర్సంటేజీ మొత్తాన్ని అప్పగించినట్లు చర్చ సాగుతోంది. దీంతో ఎమ్మెల్యే సమీప బంధువుకు ఆశ పుట్టి రూ. 20 కోట్ల పనులన్నీ తానే చూసుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది. అయితే దశాబ్దాలుగా కార్పొరేషన్‌లో కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తున్న తమను కాదని ఇతర వ్యక్తులకు పనులు కేటాయించాలని చూస్తే ఊరుకోమని అసోసియేషన్ నాయకులు హెచ్చరిస్తున్నారు. పర్సంటేజ్ ఇచ్చేందుకు తాము సిద్ధమని, పనుల జోలికి వస్తే మాత్రం ఎంతవరకైనా వెళతామని తెగేసి చెబుతున్నారు.

అర్హత ఉంటే చాలంటూ..

కాంట్రాక్ట్ పనులు దక్కించుకోవాలంటే బిడ్ అర్హత, నిబంధనలకు లోబడి ఉంటే ఎవరైనా టెండర్లలో పాల్గొనవచ్చని ఎమ్మెల్యే వర్గం చెబుతోంది. టెండర్లకు లోకల్ నాన్ లోకల్ అంటూ ఏదీ ఉండదని, అర్హత ఉండి ఎవరు తక్కువకు కోడ్ చేస్తే వారికే పనులు దక్కుతాయని వాదిస్తున్నారు.ఈ వ్యవహారం అధికారులు చూసుకుంటారని ఎమ్మెల్యే వర్గం బహిరంగంగానే చెబుతోంది. అర్హత ఉన్నప్పుడు తాము టెండర్‌లలో పాల్గొని తీరుతామని కొంత మంది చిత్తూరుకు చెందిన కాంట్రాక్టర్లు తేల్చి చెబుతున్నారు. 9వ తేదీన చేపట్టే టెండర్ ఓపెన్‌లో తాము పాల్గొంటామని, తమను వద్దనే అధికారం ఎవరికీ లేదని, ఎవరు అడ్డొస్తారో చూస్తామని హెచ్చరికలు పంపుతున్నట్లు తెలుస్తోంది. అదే స్థాయిలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సైతం తొడగొడుతున్నట్లు సమాచారం. దీంతో 9వ తేదీన ఏం జరుగుతుందోననే టెన్షన్ అధికారుల్లో ఏర్పడింది.

తనకే ఇవ్వాలంటున్న ఎమ్మెల్యే బంధువు

నగరంలో అభివృద్ధి పనులకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.13 కోట్లు, సాధారణ నిధుల నుంచి రూ. 7 కోట్లతో రోడ్లు, కాలువలు, తాగునీటి పైప్ లైన్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, పారిశుద్ధ్య నిర్వహణ పరికరాల కొనుగోలుకు సంబంధించి వేర్వేరుగా టెండర్లు పిలిచారు. మొత్తం రూ. 20 కోట్ల పనులన్నీ తాను అనుకున్న వాళ్లకే వచ్చేలా విధంగా ఎమ్మెల్యే అన్న కుమారుడు చక్రం తిప్పినట్లు తెలిసింది. ఈ విషయాన్ని పసిగట్టిన లోకల్ కాంట్రాక్టర్లు టెండర్ ఓపెన్ తేదీని మార్చాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని పనులకు సంబంధించి టెండర్లను మే 20 నుంచి ఈ నెల 2వ తేదీకి పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. మహానాడును సాకుగా చూపడంతో అధికారులు మరోమారు తేదీ మార్చేందుకు అనుమతి ఇచ్చారు. అలాగే మరి కొన్ని పనులకు సంబంధించి ఈ నెల 9వ తేదీన ఓపెన్ చేసేలా చర్యలు చేపట్టారు. ఈసారి కచ్చితంగా టెండర్లు ఓపెన్ చేయాల్సి ఉంది. లేకుంటే నిబంధనల ప్రకారం టెండర్లు రద్దు అవుతాయి. ఈ క్రమంలోనే చిత్తూరు నుంచి కొంతమంది కాంట్రాక్టర్లను దింపి రూ. 20 కోట్లకు సంబంధించి పనులన్నీ తానే చేసుకునేలా ఎమ్మెల్యే సమీప బంధువు పావులు కదుపుతున్నట్లు సమాచారం. తొలిసారి టెండర్ వాయిదా పడడానికి కారణం కూడా ఆయనేనని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై లోకల్ కాంట్రాక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

షాపుల తొలగింపునకు ఆదేశం



ఫుట్‌పాత్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరంలోని ఫుట్ పాత్‌లను ఆక్రమించి అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన షాపులు, తోపుడు బండ్లను తొలగించి పాదచారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. శుక్రవారం నగరంలోని 36వ వార్డు గిరిపురం, రాజన్న పార్కు, రామచంద్ర పుష్కరిణి తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై దుకాణాలు, బండ్లు పెట్టడంతో ఇబ్బందికరంగా ఉందని పలువురు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి షాపులు పెడితే అపరాధ రుసుము విధించాలని స్పష్టం చేశారు. రాజన్న పార్కులో ఆట వస్తువులకు మరమ్మతు చేయాలని, పెయింటింగ్స్ వేయించి శుభ్రంగా ఉంచాలని సూచించారు. తుడా ఈఈ రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈలు వెంకట ప్రసాద్, మధు, శిల్ప, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై సమీక్ష

తిరుపతి సిటీ : ప్రజలు వివిధ సమస్యలపై గ్రీవెన్స్‌లో అందించే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని తుడా ఉపాధ్యక్షులు, కమిషనర్ మౌర్య ఆదేశించారు. శుక్రవారం ఉదయం తుడా టవర్స్ పనుల పురోగతిని ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం తుడా కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతుల పరిష్కారం, తదితర అంశాలపై ఆయా విభాగాల అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. ప్రధానంగా ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల్లో ఎక్కువ అర్జీలు పెండింగ్ ఉంటున్నాయని మండిపడ్డారు. తీరు మారకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తుడా టవర్స్ నిర్మాణంలో వేగం పెంచాలని, నాణ్యతతో పనులు చేయాలని స్పష్టం చేశారు. అధికారులు సమన్వయంతో పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి పాల్గొన్నారు.

అర్చకుడిని కొనసాగించాలని వినతి

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : నగరంలోని బండారు ఆంజనేయస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు మురళిని విధుల్లో కొనసాగించాలని పలువురు భక్తులు కోరారు. శుక్రవారం ఈ మేరకు హథీరాంజీ మఠం ప్రత్యేక అధికారికి వినతి పత్రం సమర్పించారు. మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న అర్చకుడిని తొలగించేందుకు తీసుకున్న నిర్ణయంపై ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో ఉంటూ ప్రత్యేకపూజలు, స్వామి వారికి నిత్య అర్చనలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న అర్చకుడు మురళిని తొలగిస్తే ఆందోళనకు దిగుతామని పేర్కొన్నారు.

బ్యాంకింగ్ హక్కులపై అవగాహన



ర్యాలీని ప్రారంభిస్తున్న జనరల్ మేనేజర్

తిరుపతి కల్చరల్ : బ్యాంకింగ్ హక్కులు, ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్ పథకంపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని కెనరా బ్యాంక్ సర్కిల్ ఆఫీస్ హెడ్, జనరల్ మేనేజర్ ఐ.పాండురంగ మిత్తన్‌తాయ తెలిపారు. శుక్రవారం కెనరా బ్యాంక్ సర్కిల్ కార్యాలయం ఆధ్వర్యంలో అవగాహన వ్యాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వాకథాన్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌బీఐ, బెంగళూరు ప్రధాన కార్యాలయం ఆదేశాల మేరకు ప్రతి రెండు నెలలకు ఒకసారి అవగాహన ర్యాలీ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే అవగాహన మొబైల్ వ్యాన్ ఐదు రోజుల పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని వివిధ శాఖలను సందర్శించి ఖాతాదారుల సమస్యలు పరిష్కరిస్తుందని వివరించారు. కెనరా బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్లు జీఎన్ మూర్తి, రవీంద్ర కుమార్, అగర్వాల్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల జన్మదినోత్సవం



కేక్ తినిపిస్తున్న నేతలు

తిరుపతి రూరల్ : మండలంలోని వైఎస్సార్‌సీపీ నేతలు లింగేశ్వరనగర్ సర్పంచ్ కోటేశ్వరరావు, ఓటేరు సర్పంచ్ లక్ష్మి భర్త రాజయాదవ్ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మునీశ్వరరెడ్డి, ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, వెంకట రమణ, చిన్నియాదవ్, రవి, ప్రసాద్‌రెడ్డి, శ్రీరాములు, మన్నూరు శివ, తుంటి సుధాయాదవ్, మల్లెమొగ్గల ఉమాపతి, ముని, రమేష్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్యం



మానవుడి దైనందిన జీవితంలో యోగా భాగం కావాలని మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ కోరారు. యోగాంధ్ర–2025లో భాగంగా శుక్రవారం వర్సిటీలో బోధన సిబ్బందికి యోగాసనాలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ మానసిక, శారీరక దృఢత్వంతో సంపూర్ణ ఆరోగ్యానికి యోగా అవసరమన్నారు. ప్రతి రోజూ ఉదయం ఆన్‌లైన్‌నూయోగాసనాలపై అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని పాల్గొన్నారు. – తిరుపతి సిటీ

ఆందోళన



స్విమ్స్ కార్మికులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. గత రెండేళ్లుగా తమ సమస్యల పరిష్కారం కోసం ఆస్పత్రి అధికారులు, కాంట్రాక్ట్ సంస్థకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు స్విమ్స్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సూరి, రవి మాట్లాడుతూ వేతనాల పెంచాలని ఏళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రెండు వారాల్లో సమస్య పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. – తిరుపతి తుడా

నోటీస్ బోర్డు

- శ్రీగోవిందరాజస్వామివారి ఆలయ మాడవీధుల్లో ఉదయం 4.45 గంటలకు నగర సంకీర్తన.
- శ్రీకోదండరామాలయంలో ఉదయం 6 గంటలకు మూలవర్లకు అభిషేకం, సాయంత్రం 5 గంటలకు సీతారామలక్ష్మణుల ఊరేగింపు.
- శ్రీగోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు హనుమంత వాహనం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు గజవాహన సేవ.
- ఎస్వీయూ సమీపంలోని ఈద్గా మైదానంలో ఉదయం 9 గంటలకు బక్రీద్ ప్రార్థనలు.
- జిల్లాలోని 8 కేంద్రాలలో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా డీఎస్సీ పరీక్షలు.
- అప్పలాయిగుంటలో శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 7.30 నుంచి 8 గంటల నడుమ మిథున లగ్నంలో ధ్వజారోహణం.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల : తిరుమల శ్రీవారిని శుక్రవారం తెలంగాణ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి సేవించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



మాట్లాడుతున్న సురేంద్రబాబు

తిరుపతి కల్చరల్ : పుస్తకం పఠనంతో విజ్ఞానం సముపార్జించుకోవచ్చని ఎస్వీయూ ప్రధాన గ్రంథాలయాధికారి డాక్టర్ సురేంద్రబాబు తెలిపారు. శుక్రవారం వేమన విజ్ఞాన కేంద్రంలో విద్యావేత్త సీకే నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి గ్రంథాలయాలు నూతన దిశను నిర్దేశిస్తాయని వెల్లడించారు. విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ 3వేలకు పైగా పుస్తకాలు, పత్రికలు, సంచికలు అందుబాటులో ఉన్నాయన్నారు. లైబ్రరీలో నిరంతరం చర్చాగోష్ఠిలు, రీడింగ్ క్లబ్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత లైబ్రేరియన్ షణ్ముగం, సాహితీ వేత్తలు సాకం నాగరాజు, శైలకుమార్, నడ్డినారాయణ, పేరూరు బాలసుబ్రమణ్యం, ఆనందరావు, బిర్లానాయుడు, వెంకటరమణ, గురునాథం, రెడ్డెప్ప, బాలాజీ చౌదరి, టింకాలయ దామోదరం, అంకమనాయుడు, ఆకుల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.